సాక్షి
బాపట్ల

బుధవారం । 31 । జనవరి । 2024



త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

తెనాలిటౌన్: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో త్యాగరాజ గానసభ ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాజస్వామి 57వ ఆరాధనోత్సవాన్ని జరిపారు.



జాతిపితకు ఘన నివాళి

పాత గుంటూరు : గుంటూరు మార్కెట్‌సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు సంతమాగులూరులో 'జగనన్నకు చెబుదాం'



బాపట్ల: జగనన్నకు చెబుదాం స్పందన సంతమాగులూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.రంజిత్ బాషా మంగళవారం తెలిపారు.

న్యూస్‌రీల్

తైక్వాండోలో పతకాల పంట



తెనాలిటౌన్: బెంగళూరులో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగిన 6వ జాతీయస్థాయి ఓపెన్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో యూనిక్ తైక్వాండో క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించినట్లు కోచ్ బట్టు నాగరాజు మంగళవారం తెలిపారు. పోటీలో తొమ్మిదిమంది క్రీడాకారులు రెండు విభాగాల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచి 8 స్వర్ణ, 8 రజత, 2 కాంస్య పతకాలు సాధించినట్లు చెప్పారు. వినయ్, లిఫాస్, జవితేష్, వినమ్ కౌసిక్, విజయ్, ఈశ్వర్‌లు స్వర్ణ పతకాలు, జీవితేష్, కౌసిక్, ఈశ్వర్, జయనత్, కార్తికేయ, వినూత్నలు రజత పతకాలు, విజయ్, వినూత్నలు కాంస్య పతకాలను సాధించినట్లు కోచ్ నాగరాజు తెలిపారు.

యార్డుకు 1,30,851 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,30,851 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,25,366 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 20,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 71,581 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

వీఆర్‌కు కొల్లూరు ఎస్ఐ!

కొల్లూరు: కొల్లూరు ఎస్ఐ జి.రాజ్యలక్ష్మిని పోలీసు ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపినట్లు పోలీసు వర్గాల ద్వారా విశ్వసనీయ సమాచారం అందింది. శాఖాపరమైన కారణాలతో అధికారులు ఎస్ఐ రాజ్యలక్ష్మిని సోమవారం రాత్రి వీఆర్‌కు పంపుతూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం కొల్లూరు ఇన్‌చార్జి ఎస్ఐగా వేమూరు ఎస్ఐ నాగరాజును అధికారులు నియమించారు. ఎస్ఐ రాజ్యలక్ష్మిని వీఆర్‌కు తరలించినట్లు ఉత్తర్వులు అందిన అనంతరం నూతన ఎస్ఐను నియమిస్తూ ఉత్తర్వులు రానున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి.

నిబంధనలు పాటించేలా దృష్టి సారించాలి



పట్నంబజారు: వాహన షోరూం డీలర్‌లు తప్పకుండా ప్రతి ఒక్క వాహనదారుడు వాహనం కొనుగోలు చేసే సమయంలో నిబంధనలకు అనుగుణంగా నడుచుకునేలా దృష్టి సారించాలని డీటీసీ షేక్ కరీం సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్వర్ణభారతినగర్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో మంగళవారం షోరూం డీలర్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీటీసీ కరీం మాట్లాడుతూ వాహనదారులు వాహనం కొనుగోలు చేసే సమయంలో తప్పనసరిగా ఐఎస్ఐ మార్కుతో ఉన్న హెల్మెట్‌ను తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. గత ఏడాది గుంటూరు జిల్లాలో 965 ప్రమాదాలు జరగగా, అందులో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న 230 మంది దుర్మరణం పాలయ్యారని తెలియజేశారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృత్తం కాకుండా వాహనదారులకు హెల్మెట్‌లు అందజేయాలని సూచించారు. అనంతరం వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంవిఐలు ఎస్ గోపాల్, జి.సౌజన్య, షోరూం డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారులదే కీలకపాత్ర

- సాధారణ ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలి
- రాష్ట్ర ఎన్నికల కమిషన్ అదనపు సీఈఓ హరేంద్రనాథ్
- ఎన్నికల నిర్వహణపై జిల్లాస్థాయి నోడల్ అధికారులకు శిక్షణ



ఈవీఎంలు భద్రపరిచే కేంద్రాలను పరిశీలించి, అనంతరం జిల్లా కలెక్టర్‌కు సూచనలిస్తున్న అదనపు సీఈఓ సి.హరేంద్రనాథ్

బాపట్ల: సాధారణ ఎన్నికల్లో సమస్యలు ఉత్పన్నం కాకుండా నోడల్ అధికారులు సమర్థంగా పనిచేయాల్సి ఉందని ఏపీ ఎన్నికల కమిషన్ అదనపు సీఈఓ, ఈవీఎంల రాష్ట్ర నోడల్ ఆఫీసర్ సి.హరేంద్రనాథ్ తెలిపారు. ఎన్నికల నిర్వహణపై జిల్లాస్థాయి నోడల్ అధికారుల శిక్షణా కార్యక్రమం మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. అనంతరం ఈవీఎం గోదాముల భద్రత, సీసీ కెమెరాల పనితీరు, సంబంధిత దస్త్రాల నిర్వహణను జిల్లా కలెక్టర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై నోడల్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని ఈవీఎంల రాష్ట్రనోడల్ ఆఫీసర్ చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిన నాటినుంచి అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల విధి నిర్వహణపై అధికారులకిచ్చే శిక్షణలో లోపం ఉండరాదన్నారు. సి-విజిల్, సువిధ, ఎస్ కోర్ వెబ్‌సైట్ల నిర్వహణపై అప్రమత్తత అవసరమన్నారు. హోం ఓటింగ్ విధానం నూతనంగా అమల్లోకి రానుందని, దీని అమలుపై జాగ్రత్త వహించాలని, ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు.

తప్పులు జరిగితే చర్యలు : కలెక్టర్

ఎన్నికల నిర్వహణలో తప్పులు జరిగితే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా స్పష్టం చేశారు. ఎన్నికల కంట్రోల్ రూమ్, వెబ్‌సైట్ల నిర్వహణపై అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పక్కాగా అమలుచేసే విధానంపై అధికారులు అవగాహన పొందాలన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే వాతావరణం కల్పించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎన్నికలు సజావుగా సాగడానికి 16 మందిని నోడల్ అధికారులుగా నియమించామన్నారు. ఎస్‌వీసీ అనుసంధానంతో ఎప్పటికప్పుడు భారత ఎన్నికల సంఘం నుంచి వివరాలు లభిస్తాయన్నారు. వీటి ఆధారంగా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాల్సి ఉందన్నారు. అదనపు ఎస్పీ పి.మహేష్, జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, డ్వామా పీడీ బి.అర్జున్ రావు, కలెక్టరేట్ ఏఓ కె.గోపికృష్ణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణకాంత్ పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయం ప్రారంభించి, మాట్లాడుతున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

కష్టపడే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి
- సంతమాగులూరు అడ్డరోడ్డులో పార్టీ కార్యాలయం ప్రారంభం

అద్దంకి: పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. మంగళవారం సంతమాగులూరు మండలంలోని అడ్డరోడ్డులో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరికీ అండగా ఉంటానని, ఏ సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు బేధాభిప్రాయాలు లేకుండా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. అద్దంకిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి సీఎం వైఎస్ జగన్‌కు గిఫ్ట్‌గా ఇద్దామన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు మాయమాటలు చెప్పి జనాన్ని మోసం చేయడం తప్ప చేసింది ఏమీ లేదన్నారు. మేనిఫెస్టోనే మాయం చేసిన ఘనుడు అని ఎద్దేవా చేశారు.

ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా విజయం మాదే..

మంచి చేసే ప్రభుత్వాన్ని ప్రోత్సహించకపోగా, ఇతర పార్టీలతో కలిసి సంక్షేమ ప్రభుత్వంపై పోరాటానికి టీడీపీ సిద్ధం అయిందని చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. ఎన్ని పార్టీలు కలసి వచ్చినా వైఎస్సార్ సీపీ చేసిన అభివృద్ధే బ్రహ్మాస్త్రంగా తయారై వారికి సమాధానం చెబుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని చెప్పారు. పార్టీ కార్యాలయంలో తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. తొలుత దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాల వేసి, నివాళులర్పించారు. జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ చింతా రామారావు, నాయకులు గద్దల ప్రసన్న రాజ్‌కుమార్, బొల్లినేని రామకృష్ణ, హోటల్ నాగేశ్వరరావు, ఓరుగంటి కోటిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

మహాత్ముడి బాటలో అందరూ నడవాలి



మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: అహింసా మార్గంలో ఏదైనా సాధించగలమని చాటి చెప్పిన గొప్పవ్యక్తి జాతిపిత మహాత్మాగాంధీ అని, మహాత్ముడి బాటలో అందరూ నడవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి జరిగింది. గాంధీజీ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, జిల్లా జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్‌లు పూలమాలలతో ఘన నివాళులర్పించారు. స్వేచ్ఛా వాయువులతో జాతి అభివృద్ధి చెందాలని మహాత్మా గాంధీ చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ మననం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. డీఆర్ఓ పి.వెంకటరమణ, బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, కలెక్టరేట్ ఏఓ కె.గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రం

- ఒలింపిక్స్‌కు రాష్ట్రం నుంచి క్రీడాకారులను పంపడమే లక్ష్యం
- డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మెమోరియల్ క్రీడా ప్రాంగణం ప్రారంభోత్సవంలో రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి



జెండా ఊపి స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి

తాడేపల్లిరూరల్: రాష్ట్రాన్ని క్రీడల ఆంధ్రాగా తీర్చిదిద్దే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని, దానిలో భాగంగా మంగళగిరిలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మెమోరియల్ క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటుచేశారని రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరులో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రీడా ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి సమన్వయకర్త గంజి చిరంజీవిలతో కలసి ఎంపీ విజయసాయిరెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పురాతన కాలం నుంచి క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ప్రధానమంత్రి క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ మన దేశంలో ఒలింపిక్స్ నిర్వహించేందుకు కృషి చేస్తున్నారని, అందులో మన ఆంధ్రప్రదేశ్ నుంచి యువతీ యువకులు పాల్గొని, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేవిధంగా క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి గ్రామస్థాయి నుంచి ప్రోత్సహిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా మంగళగిరిలో రూ.8.50 కోట్లతో స్విమ్మింగ్, స్కేటింగ్, వ్యాయామశాల ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డితో పాటు, మంగళగిరి కార్పొరేషన్ అధికారులు, స్థానిక శాసనసభ్యులు ఎంతో కృషి చేసి దీనిని నిర్మించారన్నారు. మంగళగిరిలో ఏర్పాటు చేసిన ఈ క్రీడా ప్రాంగణానికి దివంగత నేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి క్రీడా ప్రాంగణంగా, స్విమ్మింగ్ పూల్‌కు ప్రముఖ స్విమ్మింగ్ క్రీడాకారుడు షంషేర్ ఖాన్ పేరును ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్‌కుమార్, వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, మంగళగిరి తాడేపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, మాజీ ఎంపీపీ రత్నకుమారి, మంగళగిరి తాడేపల్లి పట్టణ మహిళా సంఘం అధ్యక్షులు సంకె సునీత తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్‌లో ఏడుగురు సీఐలు బదిలీ

నగరంపాలెం: రేంజ్ పరిధిలో ఏడుగురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ జి.పాలరాజు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
ఓ.దుర్గాప్రసాద్	పీసీఆర్, ప్రకాశం జిల్లా	చీమకుర్తి పీఎస్, ప్రకాశం జిల్లా
దాసరి వెంకటేశ్వరరావు	రేంజ్ వీఆర్, గుంటూరు	కనిగిరి సర్కిల్, ప్రకాశం జిల్లా
కె.రాములునాయక్	రేంజ్ వీఆర్, గుంటూరు	యర్రగొండపాలెం సర్కిల్, ప్రకాశం జిల్లా
కె.మారుతీకృష్ణ	యర్రగొండపాలెం సర్కిల్, ప్రకాశం జిల్లా	రేంజ్ వీఆర్, గుంటూరు
కామరాజుగడ్డ సాంబశివరావు	రేంజ్ వీఆర్, గుంటూరు	సీసీఎస్, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా
కె.రవికిరణ్	రేంజ్ వీఆర్, గుంటూరు	గూడూరు టూ టౌన్ పీఎస్, తిరుపతి జిల్లా
కె.వెంకటేశ్వరరావు	గూడూరు టూ టౌన్ పీఎస్, తిరుపతి జిల్లా	రేంజ్ వీఆర్, గుంటూరు

సమన్వయంతో సమగ్రాభివృద్ధి

- పురోగతిలో అభివృద్ధి కార్యక్రమాలు
- రూ.5 కోట్ల జెడ్పీ నిధులతో వివిధ దశల్లో అభివృద్ధి పనులు
- రహదారులు, కాలువల నిర్మాణంతో గ్రామాలకు మహర్దశ
- జెడ్పీలో సమావేశమైన స్థాయీ సంఘాలు



స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా ప్రజా పరిషత్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులతో గ్రామీణ ప్రాంతాల స్వరూపం సమూలంగా మారిపోయిందని, అందరి సమన్వయంతో ఉమ్మడి జిల్లాలో సమగ్రాభివృద్ధి జరిగిందని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామీణ ప్రాంతాలు కళకళ లాడుతున్నాయని అన్నారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలో స్థాయీ సంఘాలు భేటీ అయ్యాయి. ప్రణాళిక-ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య-వైద్యం, అభివృద్ధి పనులకు సంబంధించిన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అధ్యక్షతన ఆమె చాంబర్‌లో జరిగాయి. అజెండాలో పొందుపర్చిన అంశాలపై జెడ్పీ సీఈఓ జె.మోహనరావుతో కలిసి హెనీ క్రిస్టినా ఆయా శాఖల అధికారులతో చర్చించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రూ.కోట్లాది జెడ్పీ నిధులతో చేపట్టిన పనులు అభివృద్ధికి ప్రత్యక్ష నిదర్శనాలుగా కనిపిస్తున్నాయని చెప్పారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జెడ్పీ ద్వారా మంజూరు చేసిన రూ.5 కోట్ల విలువైన పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నవీ సమగ్ర నివేదిక సమర్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, శానిటేషన్ శాఖల అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యులు సమర్పించిన ప్రతిపాదనలకు అనుగుణంగా పెద్దఎత్తున మంజూరు చేసిన పనుల పురోగతిపై సమగ్ర వివరాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మౌలిక వసతులను కల్పించడంలో అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు.

జగనన్న విద్యాజ్యోతితో నూరుశాతం ఉత్తీర్ణత..

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులు 38,269 మందికి జెడ్పీ నిధులు రూ.77లక్షలు వెచ్చించి స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినట్లు చెప్పారు.

'పది' విద్యార్థులకు అల్పాహారం..

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ చదువుతున్న విద్యార్థులకు జెడ్పీ నిధులతో సాయంత్రం వేళల్లో అల్పాహారాన్ని అందించేందుకు సర్వసభ్య సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు పబ్లిక్ పరీక్షలకు నెలరోజుల ముందు నుంచి అమలు చేయనున్నట్లు హెనీ క్రిస్టినా చెప్పారు. స్థాయీ సంఘ సమావేశాల్లో భాగంగా వ్యవసాయంపై 3వ స్థాయి సంఘం జెడ్పీ వైస్ చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ-శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘం తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘం జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన జరిగాయి. ఆయా సంఘాల సభ్యులతో పాటు మూడు జిల్లాల పరిధిలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటర్ పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

జిల్లా వృత్తి విద్యాధికారి ఎర్రయ్య



బాపట్ల అర్బన్: ఇంటర్మీడియెట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వృత్తి విద్యాధికారి పి.ఎర్రయ్య కోరారు. స్థానిక బాపట్ల జూనియర్ కళాశాలలో బాపట్ల జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఎథిక్స్ అండ్ ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్, ప్రాక్టికల్ పరీక్షలనై సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లా మొట్టమొదటిసారి జిల్లా పరిధిలో పరీక్షలు దృష్ట్యా ఎటువంటి సమస్యలు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని కోరారు. పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సి సూచనలు, ఈ సంవత్సరంలో సాంకేతికతను ఎలా వినియోగించాలి, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నంబరు కలిగి ఓటీపీ బేస్డ్ వర్క్ ఎలా చేయాలి అనే విషయాల మీద అవగాహన కల్పించారు.

నర్సింగ్ సూపరింటెండెంట్లకు ఉద్యోగోన్నతులు

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో హెడ్ నర్సులుగా పనిచేస్తున్న ఐదుగురికి మంగళవారం గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు(ఆర్డీ) కార్యాలయంలో పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించి గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లుగా ప్రమోషన్ ఇచ్చారు. జీజీహెచ్‌లో హెడ్ నర్సులుగా పనిచేస్తున్న సి.హెచ్.కమలకుమారి, కె.గ్లాడిస్ వియోలా, నున్నా ఇందిరాదేవిలకు ప్రమోషన్ ఇచ్చి గుంటూరు జీజీహెచ్‌లోనే గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లుగా పోస్టింగ్ ఇచ్చారు. ఒంగోలు జీజీహెచ్‌లో పనిచేస్తున్న సి.హెచ్. అనంతలక్ష్మికి ఒంగోలు జీజీహెచ్‌లో, నెల్లూరు ఏసీఎస్ఆర్ గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న వి.మల్లేశ్వరికి ఒంగోలు జీజీహెచ్‌లో గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లుగా పోస్టింగ్ ఇచ్చారు. ఆర్డీ డాక్టర్ జి.శోభారాణి, డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, సూపరింటెండెంట్ సుధీర్, సీనియర్ అసిస్టెంట్ నాగూర్ షరీఫ్ కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- పట్టణంలో మహిళలకు రూ.5.52 కోట్లు లబ్ధి



మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు తదితరులు

రేపల్లె రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళా అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పట్టణంలోని పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ, కుల, మతాలకు అతీతంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహోన్నత స్థానానికి చేరుకున్నారని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వైఎస్సార్ చేయూత, కాపు నేస్తం, అమ్మ ఒడి, పూర్తి ఫీజు రియింబర్స్‌మెంట్‌తో పాటు పలు పథకాలను ప్రవేశపెట్టి మహిళలు కుటుంబంలో గౌరవమైన స్థానాన్ని అందించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళలకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబాలను అభ్యున్నతి బాటలో పయనించే విధంగా మలుచుకోవాల్సిన గురుతర బాధ్యత మహిళలపై ఉందన్నారు. పట్టణ పరిధిలో 664 గ్రూపుల్లో సుమారు 6,640 మంది మహిళలకు రూ.5.52 కోట్లు లబ్ధి చేయటం జరుగుతుందని వివరించారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలిచి వైఎస్సార్ సీపీని గెలుపుపథంలో నడిపించి మహిళలు తమ రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి
- చల్లారెడ్డిపాలెంలో అభివృద్ధి పనులు ప్రారంభం



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కరణం

వేటపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించారని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని చల్లారెడ్డిపాలెంలో రూ.5.60 కోట్ల నిధులతో చేసిన వివిధ అభివృద్ధి పనుల పైలాన్‌ను ఎమ్మెల్యే కరణం, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల వద్దకే పాలన నినాదంతో ప్రతి పనికి మండల కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే చోట సమస్యలు పరిష్కారమయ్యేలా సచివాలయ వ్యవస్థను రూపొందించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన జగనన్నను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. పార్టీ సమన్వయకర్త వెంకటేష్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే వ్యవస్థల ఏర్పాటుతో ప్రజల చెంతకే పాలన వచ్చిందన్నారు. వీరితో పాటు వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాలు లబ్ధిదారులకు చేరుతున్నాయని పేర్కొన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు నేరుగా ఒకటో తేదీ వేకువజామున వారి ఇంటికి వచ్చి అందిస్తున్నారని గుర్తుచేశారు. ఇటువంటి వ్యవస్థ దేశంలో ఏక్కడా లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో చీరాల నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమని చెప్పారు. అనంతరం అక్కాయిపాలెం గ్రామస్తులు 18 మందికి ఇంటి నివేశన స్థలాల పట్టాలు అందజేశారు. ఆర్‌బీకే ముందు మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌వర్ధన్, ఎంపీడీఓ కే నేతాజీ, ఏఓ ఐ.కాశీవిశ్వనాథ్, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, ఆర్‌బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి, మాజీ సర్పంచి లేళ్ల శ్రీధర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పులి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచి కట్టా గంగయ్య, రామన్నపేట సర్పంచి రమణ, గవిని వెంకట్రావు, ఏ వెంకట్రావు, పులి సోమయ్య, జంగిలి రామారావు, జిడుగు మస్తాన్, ఆవుల అశోక్ , సాధు రాఘవ, కంచి సాంబిరెడ్డి, పి.శ్రీనివాసరెడ్డి, సంజీవరావు పాల్గొన్నారు.

ఉత్తరాఖండ్‌పై బరోడా ఘన విజయం



3 వికెట్లు తీసిన బౌలర్ ప్రమీలా



బ్యాటింగ్‌లో రాణించిన అమృత జోసఫ్



4 వికెట్లు తీసిన జనకి రాథోడ్

మంగళగిరి: నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మంగళవారం జరిగిన ఉమెన్స్ అండర్–23 వన్ డే ట్రోఫీలో బరోడా జట్టు 78 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి, బ్యాటింగ్ ఎంచుకున్న బరోడా 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసింది. బరోడా జట్టు బ్యాటర్ అమృత జోషేఫ్ 73 పరుగులతో రాణించింది. ఉత్తరాఖండ్ జట్టు బౌలర్లు ప్రమీల రావత్ మూడు వికెట్లు తీసింది. 183 పరుగుల లక్ష్యంలో బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ జట్టు 39.04 ఓవర్లలో 104 పరుగులు చేసి, ఆలవుటైంది. బరోడా బౌలర్ జనకి రాథోడ్ 4 వికెట్లుతో రాణించింది.

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి క్రీడా పోటీలు బుధవారం నుంచి ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి క్రీడా పోటీలు సమర్థంగా నిర్వహించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించాలన్నారు.

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, షటిల్, ఖోఖో క్రీడలు నిర్వహణకు బాపట్లలోని మున్సిపల్ హైస్కూల్ జూనియర్ కళాశాలలో క్రీడా మైదానాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాస్థాయి క్రీడలకు 60 టీములు బాపట్లకు వస్తాయన్నారు. 684 మంది క్రీడాకారులు హాజరుకానున్నారని వివరించారు. క్రీడాకారులకు ముఖ్యంగా వసతి, భోజన సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా వసతి ఏర్పాటు చేయాలని కోరారు. క్రీడాకారులకు అసౌకర్యం కలగకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని వివరించారు. మండల స్థాయిలో 250 జట్లకు క్రీడలు జరిగాయన్నారు. సచివాలయాలు, మండల, నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీలలో విజేతలైన వారు జిల్లా స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రీడ ప్రాంగణంలో అపరిశుభ్రత లేకుండా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్.శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ కె.పాల్ కుమార్, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ ఆర్‌వీ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏఓ కె.గోపీకృష్ణ పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి



సమావేశంలో పద్మావతి, డీఆర్వో వెంకటరమణ

బాపట్లఅర్బన్: బాలల హక్కుల పరిరక్షణ, శ్రేయస్సును ఆకాంక్షించేలా వివిధ ప్రభుత్వ శాఖలు ప్రణాళికతో పనిచేయాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి కోరారు. జిల్లా పర్యటనలో భాగంగా బాపట్ల టౌన్ స్పందన కార్యాలయంలో డీఆర్వో వెంకటరమణ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా విభాగాల్లో అమలవుతున్న బాలల హక్కులు, వారి సంక్షేమానికి చేపడుతున్న చర్యలపై పూర్తి సమాచారాన్ని సేకరించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర వ్యాప్త పర్యటనలు జరుపుతోందన్నారు. విధి నిర్వహణలోనే నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫారసులు చేయనున్నట్లు తెలిపారు. విద్య ద్వారానే సోషల్ జస్టిస్ సమానత్వం సాధ్యమన్నారు. డీఆర్వో వెంకట రమణ మాట్లాడుతూ డ్రాపవుట్స్, రేగ్యులర్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. బాల్య వివాహాలను క్షేత్ర స్థాయిలో నిరోధించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మంచి, చెడు స్పర్శ గురించి విద్యార్థులకు మహిళా సంరక్షణ కార్యదర్శి ద్వారా జిల్లాలో అవగాహన కలిగిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం పద్మావతి బాపట్ల జిల్లా ఏరియా హాస్పిటల్‌ను సందర్శించారు. బాపట్ల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ఉమ, జిల్లా ఏఎస్పీ మహేంద్రా, డెప్యూటీ డీఈఓ శ్రీనివాస్, డీఐడీ వెంకటేస్వర్లు అధ్యక్షత వహించారు. బాపట్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ శైలజ, జిల్లా బాలల పరిరక్షణ విభాగ ఇన్‌చార్జి సీడీపీఓ పురుషోత్తం, కౌన్సిలర్ జి.రోజిలిన్, సోషల్ వర్కర్ పి.సులోచన, అవుట్ వర్కర్ డి.రాము పాల్గొన్నారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమ, బాపట్ల ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ సిద్ధార్థ పాల్గొన్నారు.

వియత్నాం విద్యార్థులతో వర్చువల్ భేటీ



వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న పెసర్లంక హైస్కూల్ విద్యార్థులు

పెసర్లంక(భట్టిప్రోలు): స్థానిక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం వియత్నాం దేశంలోని గార్డెనీయ విన్స్ స్కూల్ విద్యార్థులతో వర్చువల్‌గా భేటీ అయ్యారు. వర్చువల్ విధానంలో ఇరు దేశాలకు చెందిన ఆంగ్లోపాధ్యాయులు స్టెల్లానాక్స్, ఉల్లంగుంట వెంకటేశ్వరరావు విద్యార్థులతో మాట్లాడించారు. అక్కడ జరుగుతున్న నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఇరుదేశాల విద్యార్థులు, వారి సంప్రదాయాలు, పండుగలు తదితర విషయాను చర్చించుకున్నారు. తొలుత వియత్నాం స్కూల్ విద్యార్థులు డాక్యుమెంటేషన్ ఇచ్చారు. అలాగే నూతన సంవత్సర వేడుకలు, పండుగలు, ఆహార పదార్థాలు, స్కూల్ విద్యా విధానం, పరీక్షలు, ఆట పాటల గూర్చి అడిగి తెలుసుకున్నారు. తెలుగువారి దుస్తులు, సంప్రదాయాలు వియత్నాం విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ వర్చువల్ విధానం వల్ల స్పోకెన్ ఇంగ్లిష్ స్కిల్స్ పెంపొందుతాయని ఆంగ్లోపాధ్యాయులు వెంకటేశ్వరరావు తెలిపారు. వెంకటేశ్వరరావుతో పాటు సంధాన కర్తగా పరమేశ్వరరావు వ్యవహరించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్కే మహబూబ్ బాషా వియత్నాం విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

వ్యర్థాల సేకరణతో అదనపు ఆదాయం

సెర్ప్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సెర్ప్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

బల్లికురవ: ప్రతి గ్రామంలో తడిచెత్త, పొడిచెత్తను వేరుగా సేకరించి చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవచ్చని సెర్ప్ జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో 21 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సేకరించిన చెత్తను రోడ్ల వెంట వేసి కాల్చటం వల్ల కాలుష్యం పెరిగి ప్రజలు అనారోగ్యం బారిన పడతారన్నారు. గ్రామాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ జ్వరాలు, వ్యాధులు సోకవని, ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య, ఈవోఆర్డీ సుమతి, సెర్ప్ ట్రైనర్ బొల్లయ్య, ప్రదీప్, ఏసోబు పాల్గొని మాట్లాడారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఎస్పీ వకుల్‌జిందాల్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల టౌన్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సెబ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలు సమర్థంగా నిర్వహించాలంటే ముందు అక్రమ మద్యం, నాటుసారా కట్టడి చేయాలన్నారు. జిల్లాలో నగరం, బాపట్ల, చీరాల సెబ్ స్టేషన్‌ల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో నాటుసారా తయారీ జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఆ ప్రాంతాల్లో వరుస దాడులు నిర్వహించి కట్టడి చేయాలన్నారు. రైల్వే, రోడ్డు మార్గాల ద్వారా ఇతర రాష్ట్రాల మద్యం జిల్లాలోకి వచ్చే అవకాశం ఉన్నందున వాహన తనిఖీలు నిరంతరం నిర్వహించాలన్నారు. చిన్న మొత్తంలో అక్రమమద్యం పట్టుబడిన పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా విచారిస్తే ఎక్కువ మొత్తంలో అక్రమమద్యం పట్టుబడే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేసి వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్ సెబ్ ఏఈఎస్ జి.నరసింహారావు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

బాపట్లటౌన్: అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి 2009 బ్యాచ్ కానిస్టేబుల్స్ అందించిన రూ.2.44 లక్షల చెక్‌ను మృతుడి భార్య శ్రావణికు ఎస్పీ వకుల్‌జిందాల్ మంగళవారం అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ నిజాంపట్నం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ 2009 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ మోపిదేవి చలపతిరావు 2003 జూన్ 23న లివర్ సమస్యతో మృతి చెందినట్లు చెప్పారు. అతడి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 2009 బ్యాచ్‌కు చెందిన సిబ్బంది జీతాల నుంచి సేకరించిన మొత్తాన్ని అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో 2009 బ్యాచ్‌కి చెందిన కానిస్టేబుళ్లు సాయికుమార్, శివ శంకర్, నరేష్, జానకి, స్వప్న పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో పొందే విజ్ఞానం శాశ్వతం

గుంటూరు ఎడ్యుకేషన్ :పుస్తక పఠనం ద్వారా పొందే విజ్ఞానం జీవితాంతం మనతోనే ఉంటుందని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాల కుటీర్ 49వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అద్దంకి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు గురువుల అడుగుజాడల్లో నడచి, విజ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ దినచర్యను పుస్తక పఠనంతో ప్రారంభించి, విజ్ఞానదాయక పుస్తకాలను చదవాలని అన్నారు. లాం వ్యవసాయ వర్సిటీ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ ఎ.మణి మాట్లాడారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

15 సవర్ల బంగారం, రూ.1.30 లక్షల నగదు అపహరణ



దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

అద్దంకి రూరల్: తాళం వేసిన ఇంట్లో దొంగలు రెచ్చిపోయి బంగారు ఆభరణాలు, నగదు అపహరించారు. ఈఘటన మంగళవారం అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న సీఐ పీ కృష్ణయ్య, ఎస్సై వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సీఐ వివరాల మేరకు అద్దంకిలోని వాసవి నగర్‌లో నివాసం ఉంటున్న దేసు శివనాగరమేష్ శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి ఒడిశాలోని పూరిజగన్నాథస్వామి దర్శించుకునేందుకు వెళ్లారు. తిరిగి మంగళవారం ఉదయం ఇంటికి రాగానే ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతో అనుమానంతో పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇచ్చారు. సీఐ, ఎస్సైలు ఘటనా స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరుని పరిశీలించారు. బీరువాలో ఉన్న 15 సవర్ల బంగారపు నగలు, రూ.1.30 లక్షల నగదును దొంగిలించినట్లు యజమాని వాపోయారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు కొనసాగించనున్నట్లు సీఐ తెలిపారు.

248 మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లతో ఎస్ఐ, సిబ్బంది

సంతమాగులూరు (అద్దంకి): అక్రమంగా దాచి ఉంచిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు మండలంలోని రామిరెడ్డిపాలెం గ్రామంలో ఎస్సై శివప్రసాద్ సిబ్బందితో మంగళవారం సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అక్రమంగా దాచి ఉంచిన 248 క్వార్టర్ మద్యం బాటిళ్లను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అనుమానితుని అరెస్టు చేసి కేసు నమోదుతో విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంతో పోషకాలు మెండు



స్టాల్స్ పరిశీలిస్తున్న డైరెక్టర్ డాక్టరు ప్రసాదరావు

తూములూరు(కొల్లిపర): విచక్షణా రహితంగా రసాయన ఎరువుల వాడకంతో.. భూమిలో పంటలకు కావాల్సిన పోషకాలు అందుబాటులో లేక సమతుల్యత లోపించి, ద్వితీయ సూక్ష్మ పోషక లోపాలు పంటల్లో కనిపిస్తున్నాయని గుంటూరు జిల్లా లాంఫాం అసోసియేట్ డైరెక్టర్ డాక్టరు జీవీఎస్ ప్రసాద్‌రావు అన్నారు. వీటిని అధిగమించడానికి సేంద్రియ వ్యవసాయ పద్ధతులు మేలని ఆయన సూచించారు. మంగళవారం మండలంలోని తూములూరు గ్రామంలోని రేణుకదేవి ఆలయ కల్యాణ మండపంలో 30 మంది బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రైతు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లాలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయంపై తమ పరిశీలనలో పెంచుకున్న అవగాహనను వివరించారు. వివిధ రకాల పంటలను స్టాల్స్‌లో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టరు జీవీఎస్ ప్రసాద్ రావు పాల్గొన్నారు. విద్యార్థినులు ఏర్పాటు చేసిన వ్యవసాయ పంటల స్టాల్స్‌ను పరిశీలించారు. రైతు సదస్సులో మాట్లాడుతూ వ్యవసాయంలో సాంకేతికను ఉపయోగించుకొని దిగుబడులు పెంచుకోవాలని సూచించారు. మేలైన వంగడాలను ఉపయోగిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయన్నారు. రైతు సదస్సు కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు వ్యవసాయ విద్యార్థినులను అభినందించారు. లాంఫాం కో–ఆర్డినేటర్ కిషోర్‌బాబు, టీటీటీ శ్రీలతా వాణి, కీటక శాస్త్రవేత్త నగేష్, మండల వ్యవసాయాధికారి కె.వెంకటరావు, ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి తదితరులు రైతులకు అనేక సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం రైతులకు వ్యవసాయంపై క్విజ్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఉత్తమ రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అవుతు శ్రీనివాసరెడ్డి, కొండా కిషోర్‌రెడ్డి, వింతా వేణుగోపాలరెడ్డి, రైతులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9, 10 వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.